క్లుప్తంగా

ఘనంగా మాతృదినోత్సవం



బీకే రాజేశ్వరికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బ్రహ్మకుమారీలు

బొబ్బిలి: పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బొబ్బిలి శాఖలో ఆదివారం మాతృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేంద్ర ఇన్‌చార్జ్ బీకే రాజేశ్వరికి బ్రహ్మకుమారీలంతా మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

జగదీశ్వరరావు సస్పెన్షన్‌కు సిఫార్సు

బొబ్బిలి: బాడంగి మండలం వాడాడకు చెందిన పూడి జగదీశ్వరరావు వైఎస్సార్‌సీపీలో ఉంటూ ఇతర పార్టీలతో జతకట్టిన పూడి జగదీశ్వరరావును సస్పెండ్ చేయాలని పార్టీ అధిష్టానానికి సిఫార్సు చేసినట్టు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, పార్టీలో ఉంటూ క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడిన జగదీశ్వరరావుపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

తెర్లాం: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తెర్లాం శాఖా గ్రంథాలయాధికారి సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చిన్నారులకు ఆదివారం పలు ఆటలపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల కలయిక



అప్పటి గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తెర్లాం: మండలంలోని పెరుమాళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004 – 05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా కలిసి ఆదివారం పాఠశాల ఆవరణలో గెట్ టు గెదర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం ఎవరెవరు ఎక్కడెక్కడ స్థిరపడినదీ తెలుసుకుని, చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని సందడి చేశారు. అప్పుడు తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సత్కరించారు.

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు



రాజాం: ఎంజేవలసలో బోరు బాగు చేస్తున్న మెకానిక్‌లు

వంగర: తాగునీటి ఎద్దడి నివారణే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని పటువర్ధనం గ్రామంలో మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లను ఆదివారం బాగుచేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. ఇన్నాళ్లు తాగునీటి కోసం ఇబ్బంది పడిన ప్రజలు ప్రభుత్వం చేయిస్తున్న ఈ పనులతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజాం: క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని అన్ని పంచాయతీల్లో మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లను బాగు చేస్తున్నారు. పంచాయతీ నిధులతో పాటు క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా మంజూరైన రూ.3 లక్షల వ్యయంతో చాలా గ్రామాల్లోని బోర్లు బాగు చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రాజేష్ తెలిపారు. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు ఉండకూడదనే ఈ పనులు చేయిస్తున్నామన్నారు.

జై.. హనుమాన్..!

జై హనుమాన్ నామస్మరణ మార్మోగింది. ఆంజనేయస్వామి జయంతి పురస్కరించుకుని, పట్టణాలు, పల్లెల్లోని ఆలయాలు భక్తులతో ఆదివారం కిటకిటలాడాయి. వేదపండితులు, పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రధాన వీధుల్లో స్వామి చిత్రపటాలు, విగ్రహాలను ఊరేగిస్తూ జై వీరాంజనేయ, జై జై హనుమాన్ అని నినాదాలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఆయా కార్యక్రమాలతో అంతటా పండగ సందడి నెలకొంది.

–సాక్షి నెట్‌వర్క్



వంగర: ఆంజనేయస్వామికి భక్తుల పూజలు



రాజాం: హనుమాన్ ఆలయంలో భక్తుల పూజలు



తెర్లాం: నందబలగలో పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి



బాడంగి: భీమవరంలో పూజలు చేస్తున్న అర్చకులు



బొబ్బిలి: పక్కిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



బొబ్బిలి: తారకరామా కాలనీలో పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, తదితరులు



రామభద్రపురం: హనుమంతునికి పూజలు చేస్తున్న భక్తులు



సంతకవిటి: మందరాడ అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రేగిడి: లక్ష్మీపురంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

సుర్రుమంటున్న సూరీడు..



రామభద్రపురంలో నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి

భానుడు భగ్గుమంటున్నాడు.. వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తున్నారు. ఉదయం 9 గంటలకే ప్రజలు బయట తిరగలేని పరిస్థితి. భానుడి ప్రతాపానికి ఉష్ణోగ్రతలు పెరిగి పోవడంతో వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు 10 గంటలకే ఇళ్లకు చేరుకుంటున్నారు. నిత్యం ప్రజలు, ప్రయాణికులతో రద్దీగా ఉండే రామభద్రపురంలోని జాతీయ రహదారి ఆదివారం నిర్మానుష్యంగా మారింది. ఎండ వేడిమికి తట్టుకోలేక 12 గంటలకే వ్యాపారులు దుకాణాలు మూసేసారు.



ఎండకు తట్టుకోలేక సాలూరు రోడ్డులో చున్నీలు తలపై కప్పుకొని వస్తున్న యువతులు

– రామభద్రపురం

కుంచించుకుపోతున్న ఏకేఎల్ గెడ్డ



చిన్న కాలువలా కనిపిస్తున్న ఆకులలోవకట్ట గెడ్డ

రేగిడి: మండలంలోని ఉనుకూరు–సంకిలి గ్రామాల మధ్య ఉన్న ఏకేఎల్(ఆకులలోవ కట్ట) గెడ్డ రోజురోజుకూ కుంచించుకుపోతోంది. గెడ్డ గట్టు వెంబడి రెల్లిపొదలు, కలుపుమొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు వర్షాలకు గట్టు మన్ను కరిగి గెడ్డలోకి జారుతుండడంతో గెడ్డ వెడల్పు తగ్గిపోతోంది. ఇదే గెడ్డ అంబాడ, వెంకటాపురం, నాయిరాలవలస, తునివాడ, వెంకమ్మపేట, కొత్తచెలికానివలస, ఆమదాలవలస, చిన్నయ్యపేట, సంకిలి గ్రామాల్లోని 4,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తోంది. ప్రస్తుతం ఈ గెడ్డ కుంచించుకుపోతున్న కారణంగా దాని ద్వారా సాగునీరు సరఫరా కూడా అంతంతమాత్రంగానే ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా గెడ్డ గట్టు వెంబడి విపరీతంగా పెరిగిన కలుపుమొక్కలు తొలగించడంతో పాటు గెడ్డలో పూడికతీతలు చేపట్టాలని కోరుతున్నారు.

హద్దురాళ్లు పాతడం వేగవంతం

తెర్లాం: భూముల సరిహద్దులు గుర్తించి హద్దురాళ్లు వేసే కార్యక్రమం వేగవంతం చేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని రామన్న అగ్రహారంలో హద్దురాళ్లు పాతే కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా ఇప్పటికే మండలంలోని అనేక గ్రామాల్లో భూముల రీసర్వే చేసి హద్దు రాళ్లు పాతినట్లు చెప్పారు. హద్దు రాళ్లు వేసే సమయంలో సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలు దగ్గరుండి పరిశీలించాలని సూచించారు. ఆయనతో పాటు మండల సర్వేయర్ వెంకటరమణ, తదితరులు ఉన్నారు.



రామన్న అగ్రహారంలో హద్దురాళ్లు దింపిస్తున్న తహసీల్దార్ డోల రాజేశ్వరరావు

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న విద్యార్థులు

రాజాం: పట్టణ పరిధిలోని కొత్తవలస గ్రామ ప్రధాన కూడలిలో అక్కడి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఆదివారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం కుదమ తిరుమలరావు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించి, అటువైపుగా వెళ్తున్న పలువురు ప్రయాణికులు, పాదచారులు, స్థానికులకు గ్లాసులతో మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ మేకల రామారావు, పంచాయతీ సచివాలయ కార్యదర్శి చీడి శ్రీనివాసరావు, వీఆర్‌ఓ నక్క హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు

రేగిడి: వేసవి ఎండల నేపథ్యంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు సూచించారు. స్థానిక విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆయన ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులంతా అనారోగ్యానికి గురికాకుండా ఉండాలన్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వీలైనప్పుడల్లా నిమ్మరసం, జ్యూస్ తాగాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లతో ఫీవర్ సర్వే చేయిస్తున్నామన్నారు. ఎవరైనా అనారోగ్యంతో బాధపడితే పీహెచ్‌సీలకు చేరుకుని, వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

ప్రతిఒక్కరూ సద్గుణాలు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వక్త దామోదరరావు

రేగిడి: ప్రతిఒక్కరూ సద్గుణాలు అలవర్చుకోవాలని ఆధ్యాత్మిక వక్త గొర్లె దామోదరరావు తెలిపారు. మండలంలోని దేవదళ గీతాశ్రమంలో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక దివ్య మహాసభలో పాల్గొన్న ఆయన భక్తులను ఉద్దేశించి, కాసేపు మాట్లాడారు. రోజులో కొంత సమయాన్ని దైవాన్ని కొలిచేందుకు కేటాయించాలన్నారు. భక్తిభావంతో భగవంతుడిని వేడుకుంటే సకల శుభాలు కలుగుతాయన్నారు. పరులకు సేవ చేయడం ద్వారా ఆత్మసంతృప్తితో పాటు దైవానుగ్రహం కూడా ఉంటుందన్నారు.

రైతులను మోసం చేసింది చంద్రబాబే..



మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, తదితరులు

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి

రామభద్రపురం: రైతులను ఎక్కువగా మోసం చేసింది చంద్రబాబేనని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రైతులకు ఎక్కువగా మేలు జరిగిందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ, టీడీపీ హయాంలో రైతులకు పూర్తి రుణమాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు రెండు దఫాలు చెల్లించి, మిగతా మూడు దఫాలు ఎగ్గొట్టిన విషయం తెలుసుకోవాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వాతావరణ విపత్తుల సమయంలో పంటలు పూర్తిగా పాడై రైతులు నష్టపోతే పరిహారం అందించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రైతు స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసిన విషయం తెలుగుదేశం నాయకులు తెలుసుకోవాలన్నారు. మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకముందే రైతుల అవసరాల కోసం ఆర్‌బీకేల్లో ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో నియోజకవర్గంలోని ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాయన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, నాయకులు డర్రు పైడిరాజు, కనిమెరక అప్పారావు పాల్గొన్నారు.

రాజాం చరిత్ర రచనకు సహకరించాలి



మాట్లాడుతున్న రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు రంగనాథం

రాజాం సిటీ: రెండేళ్లుగా రాస్తున్న రాజాం చరిత్ర రచనకు రాజాం ప్రాంత మేధావులు తమవంతు సహకారం అందించాలని రాజాం రచయితల వేదిక నిర్వాహకులు గార రంగనాథం కోరారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన చరిత్రకు సంబంధించిన పుస్తకం చివరి దశకు చేరుకుందని, రాజాంతో పాటు మండల పరిసర గ్రామాల్లో, ఇంకా ఎక్కడైనా చారిత్రక అవశేషాలు ఉంటే వాటి విశేషాలు తెలియజేయాలన్నారు. ఆదిమ మానవుల ఆనవాళ్లు, సమాధులు (రాక్షసగుళ్లు) ఫాజిల్స్, విగ్రహాలు, శాసనాలు, పురాతన భవనాలు, గుడులు, తాళపత్ర గ్రంథాలు, చరిత్ర పుస్తకాలను అందించాల్సిందిగా ఆయన కోరారు. రాజాం చరిత్రకు సంబంధించి ఏ విషయమైనా చెప్పాలనుకుంటే ఫోన్ నంబర్ 9885758123ను సంప్రదించాలన్నారు. సమావేశంలో రచయితలు పి.తిరుపతిరావు, ఎ.మోహనరావు, పి.శ్రీనివాసరావు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి ఆర్.రవితేజ తదితరులు పాల్గొన్నారు.

జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం



రామభద్రపురం వద్ద పూడికలు తొలగించిన పెద్దగెడ్డ ప్రధాన కాలువ



బాగు చేసిన సోంపురం రూట్‌లో పాతుడివాని చెరువుకు వెళ్లే పిల్ల కాలువ



పూడిక తొలగించిన పెద్ద గెడ్డ ప్రధాన కాలువ నుంచి కొట్టక్కి పెద్ద చెరువుకు వెళ్లే ఫీల్డ్ చానల్

జల సంరక్షణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఉపాధి పనుల్లో భాగంగా చెరువుల్లోకి వర్షపు నీరు వెళ్లేందుకు ఫీడర్ చానళ్లను అభివృద్ధి చేస్తున్నారు. ప్రధాన కాలువలతో పాటు పంట పొలాలకు వెళ్లే చిన్న కాలువల్లో (ఫీల్డ్ చానళ్లు) సైతం పూడికలు తీసి బాగు చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఫీడర్ చానళ్లు, పంట పొలాలకు వెళ్లే ఫీల్డ్ చానళ్లకు సంబంధించి 368 పనులకు గాను సుమారు రూ.9.37 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 65 పనులు పూర్తికరాగా.. పనులకు సుమారు రూ.2.40 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన పనులు జోరుగా సాగుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– రామభద్రపురం